భర్త దొమ్మేటి సునీల్‌పై వరకట్నం, వేధింపులపై కేసు
ఫిర్యాదు చేసిన టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య
- మెయిన్‌లో

అప్రమత్తం..



ఐ.పోలవరం మండలం భైరవపాలెం వద్ద ఒడ్డుకు చేరిన బోట్లు

వాన కురుస్తూనే ఉంది..

అమలాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఉదయం నుంచి 4.30 గంటల వరకు అత్యధికంగా 40 మిల్లీమీటర్ల వర్షపాతం ఉప్పలగుప్తంలో, అత్యల్పంగా రామచంద్రపురంలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 15.4, మండపేట 10.4, రాయవరం 11.4, ఆలమూరు 14.8, రావులపాలెం 21.6, కొత్తపేట 18.4, కపిలేశ్వరపురం 13.4, కె.గంగవరం 15.4, ఐ.పోలవరం 16.6, ముమ్మిడివరం 16.4, అయినవిల్లి 18.6, పి.గన్నవరం 12.8, అంబాజీపేట 12.0, మామిడికుదురులో 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా రాజోలులో 20.8, మలికిపురం 25.0, సఖినేటిపల్లి 25.2, అల్లవరం 21.2, అమలాపురం 18.4, కాట్రేనికోనలో 32.6 వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 18.5 వర్షపాతం రికార్డయింది.



తుఫాన్ పరిస్థితిపై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి విజయరామరాజు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఆరువేల మంది పునరావాస కేంద్రాలకు..

- తక్షణం తరలించాలని తుఫాన్ ప్రత్యేకాధికారి విజయరామరాజు ఆదేశం
- కలెక్టర్ మహేష్‌కుమార్‌తో కలసి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు

అమలాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావానికి గురయ్యే కోనసీమలోని సముద్ర తీరంలో ఉన్న సుమారు 6 వేల మందిని దగ్గరలో ఉన్న తుఫాన్ షెల్టర్లు, ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి తుఫాన్ సహాయక చర్యల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, అవి పడిపోయే ప్రమాదం ఉన్న దృష్ట్యా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక పునరుద్ధరణ చర్యలకు సిద్ధం కావాలని సూచించారు. కమ్యూనికేషన్స్ విద్యుత్ వ్యవస్థలు పనిచేసేలా తక్షణ చర్యలు చేపట్టే విధంగా ఏర్పాట్లుచేసుకోవాలని, విద్యుత్, తాగునీరు, రోడ్లు, టెలికాం వంటి సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. ప్రజలను అప్రమత్తం చేయాలని, తుఫాన్ ప్రభావ పరిస్థితి క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని విజయరామరాజు ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యఆరోగ్యశాఖ, విద్యుత్ వంటి శాఖలను సమన్వయం చేస్తూ పటిష్ఠమైన సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. తుఫాన్ ప్రాబల్యం ఉన్నచోట ప్రత్యేక ఇన్‌చార్జి అధికారులను నియమించాలని, వారి సమన్వయంతో విపత్తు నిర్వహణ బృందాలు మోహరించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. రిలీఫ్ రెస్క్యూ ఆపరేషన్‌లో విపత్తు నిర్వహణ బృందాల సహాయం కోరాలన్నారు. కంట్రోల్‌రూమ్‌లు కలెక్టరేట్, డివిజన్, మండల, గ్రామ కార్యాలయాల వరకు ఏర్పాటుచేసి పరిస్థితులను సమీక్షించాలన్నారు. రోడ్డు కనెక్టివిటీ, పవర్‌లైన్ కనెక్టివిటీపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ వల్ల సాగునీరు విడుదల కాకుండా నిలుపుదల చేయాలని లేనిపక్షంలో ముంపు బెడద తీవ్రమయ్యే ప్రమాదం ఉన్న దృష్ట్యా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 28న సహాయక, రెస్క్యూ విధులకు అందరూ సిద్ధం కావాలని కోరారు. పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించి అక్కడ సహాయ చర్యలు చేపట్టి హెచ్‌ఎంను హెడ్ క్వార్టర్‌లో ఉండేలా చూడాలని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా నిరోధించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొత్తమొంథా.. అలజడి!



ముంచుకొస్తోంది : ఉప్పాడ కొత్తపల్లి వద్ద సముద్రం

సురక్షిత ప్రాంతాలకు : కాట్రేనికోన వద్ద మత్స్యకారుల తరలింపు

ఉప్పాడ వద్ద కల్లోల తీరం..



సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో తుఫాన్ బీభత్సం అధికంగా ఉండనున్నందున ఈ ఇద్దరి కలెక్టర్లతో సీఎం చంద్రబాబు తరచూ సమీక్షలు నిర్వహిస్తు న్నారు. బాధితులకు ఏ ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూ చించారు. కాకినాడ జిల్లాలో పునరావాస శిబిరాలకు వెళ్లినచోట ప్రజల ఇళ్లకు ఇబ్బందులు లేకుండా గస్తీ పెంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు ముమ్మరం అయ్యేలా చూడాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం అర్ధరాత్రి తర్వాత తుఫాన్‌గా బలపడింది. ఈ క్రమంలో ఉత్తర వాయువ్యంగా పయనించి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. సోమవారం మధ్యాహ్నం సమయానికి కాకినాడకు 490 కి.మీ వద్ద తుఫాన్ కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయం నుంచి గంటకు 17 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. అదే వేగంతో పయనించి మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-విజయనగరం మధ్య కాకినాడ వద్ద తీరం దాటుతుందని భారతవాతావరణ శాఖ తెలిపింది. అయితే తీవ్ర తుఫాన్ కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఈ రాత్రి గడిస్తే చాలు

1996 నవంబరు 6న రాత్రి ఒక్కసారిగా తుఫాన్ వచ్చింది.. కోనసీమను తుడిచిపెట్టేసింది.. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంచనా. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి ఒక్కరూ ఈ రాత్రి గడిస్తే చాలనుకుంటున్నారు..

గంటకు వేగం 100 కి.మీ..

రోజంతా ఒక్కటే వాన..

తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడగా.. రాత్రి నుంచి వర్షాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రికి తీరం దాటనుండడంతో మంగళవారం నుంచి పెనుగాలులు అధికంగా ఉంటాయని ..అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు. తుఫాన్ ధాటికి చెరువులు, రిజర్వాయర్లు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. అనేక చోట్ల గండ్లు పడే ప్రమాదం ఉండడంతో జలవనరుల శాఖ అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. విద్యుత్‌శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సరిదిద్దడానికి వీలుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

దూసుకొస్తున్న తుఫాన్

- వణుకుతున్న ఉమ్మడి జిల్లాలు
- ఇప్పటికే భారీ వర్షాలు.. గాలులు
- అల్లకల్లోలంగా మారిన తీరం
- కాకినాడ - యానాం మధ్య హైఅలర్ట్
- తీరం దాటుతుందన్న సంకేతాలు
- పోర్టులో ఏడో నెంబరు హెచ్చరిక
- పలు రైళ్లు, విమానాలు రద్దు
- సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు

గాలుల తీవ్రత మంగళవారం సాయంత్రానికి గంటకు 100 కిలోమీటర్ల వరకు ఉంటాయన్న హెచ్చరికలు ప్రజల్లో వణుకుపుట్టిస్తున్నాయి. మరో వైపు సోమవారం రాత్రి కాకినాడ పోర్టులో ఏడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ప్రమాద హెచ్చరికలు జారీ అవడం తుఫాన్ తీవ్రతను చాటుతోంది. సామర్లకోట,రాజమహేంద్రవరం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు.రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి వెళ్లే పలు విమానాలు రద్దుచేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీచ్‌లకు వెళ్లే అన్ని రహదారులు మూసివేశారు.

కాకినాడలో 269 పునరావాస కేంద్రాలు

కాకినాడ జిల్లాలో 12 తుఫాన్ ప్రభావిత మండలాల్లో 269 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.జిల్లాలో 3.35 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపుతుందని గుర్తించారు. నిత్యావసరాలు తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యుత్,ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాకినాడ జిల్లాలో తుఫాన్ తీరం దాటుతుందన్న సమాచారంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ సోమవారం అధికారులను అప్రమత్తం చేశారు.

కోనసీమలో 90 కి.మీ తీరం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి) కోనసీమ జిల్లాకు రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తుఫాన్ సహాయక, పునరావాస చర్యలపై ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి పరిశీలించారు. జిల్లా పరిధిలో సుమారు 90 కి.మీ తీర ప్రాంతం ఉండగా 120 పునరావాస కేంద్రాల్లోకి ఆరు వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు.

తూర్పున యంత్రాగం అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికలతో తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంత్రి దుర్గేష్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన కె.కన్నబాబు నిడదవోలులో పర్యటించారు.

'తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి'



కేశనపల్లిలో పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేకాధికారి విజయరామ రాజు, కలెక్టర్ మహేష్‌కుమార్

మలికిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను దగ్గరకొచ్చే కొద్దీ తీవ్ర ప్రభావం చూపనుందని మొంథా తుఫాన్ సహాయక చర్యల జిల్లా ప్రత్యేకాధికారి, విద్యాశాఖ సంచాలకులు వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కేశనపల్లిలో తుఫాను పునరావాస కేంద్రంలో పునరావాసం పొందుతున్న ముంపు బాధితులను పరామర్శించి అధికారికంగా కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు, వసతి, ఆరోగ్య సంరక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారితో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ మొంథా తుఫాన్ పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం తీవ్ర తుఫానుగా మారి రాత్రికి తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. సుమారు 90 కిలోమీటర్ల వేగంగా బలమైన ఈదురు గాలులు వీస్తాయన్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉందని ఎవరూ అశ్రద్ధగా ఉండవద్దన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గిందనుకుని నిర్లక్ష్యం వహించరాదని, ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం ముందుకు వెళ్లాలన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలు అందించేందుకు సంసిద్ధంగా ఉందని, అత్యవసర పరిస్థితుల్లో వీరి సహకారం కోరుతూ సురక్షితంగా తుఫాన్ బారి నుంచి రక్షణ పొందాలన్నారు. గతానుభావాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్వేల్యాండ్స్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్, ప్రత్యేక అధికారి అమన్‌శర్మ

యానాంలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

- మొంథాపై అలర్ట్.. 18 సైక్లోన్ రిలీఫ్ కేంద్రాల ఏర్పాటు
- పుదుచ్చేరి నుంచి యానాం చేరుకున్న ప్రత్యేక అధికారి... అధికారులతో సమీక్ష

యానాం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో యానాం నియోజకవర్గ పరిధిలోని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినట్టు పరిపాలనాధికారి అంకిత్ కుమార్ తెలిపారు. తుఫాన్‌కు సంబంధించిన అంశాలపై మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్, ప్రజాపనుల శాఖ, ఆరోగ్య, విద్యా, పోలీస్, ఫైర్, వ్యవసాయ తదితరశాఖలు చేపటాల్సిన చర్యలపై చర్చించి అదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. అలాగే విశాఖపట్నానికి చెందిన డీఎస్పీ ఎండీ అస్లమ్ నేతృత్వంలో 30 మంది ఎన్డీఆర్‌ఎఫ్ బృందం యానాం చేరుకుంది. ఇక తుఫాన్ బాధితులను తరలించేందుకు 18 సైక్లోన్ రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని, వీటిలో పది ప్రసుత్తం పని చేస్తున్నాయని, మిగిలిన 8 కేంద్రాలను రిజర్వులో ఉంచామన్నారు. దీనిలో భాగంగా మూడు రోజులపాటు యానాంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించడం జరిగిందని, మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా నిషేధం విధించినట్టు తెలిపారు. అలాగే పర్యాటక కార్యక్రమాలను నిలుపుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పుదుచ్చేరి ప్రభుత్వ ఉన్నాతాధికారులకు తెలియజేయడం జరుగుతోందన్నారు. ఇదిలా ఉండగా పుదుచ్చేరి నుంచి ప్రత్యేక అధికారి ప్రస్తుత పుదుచ్చేరి విద్యాశాఖ డైరెక్టర్, పూర్వపు యానాం పరిపాలనాధికారి అమన్‌శర్మ యానాం చేరుకున్నారు. ఈ సందర్భంగా అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. యానాం- కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున ఆ సమయంలో విపరీతమైన ఈదురు గాలులు 90- 110 కిలోమీటర్ల వేగంతో వీయనున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తగినంత కిరాణా, పాలు, నీరు నిల్వ చేసుకోవాలని సూచించారు. తాటాకు ఇళ్లలో ఉన్నవారంతా తుఫాన్ సురక్షిత కేంద్రాల్లోకి వెళ్లాలన్నారు. అక్కడ వారికి కనీస సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి విపత్తు ఎదురైనా 0884-2321223, 0884-2321200, టోల్‌ఫ్రీ నెం బరు 18004252303కు సంప్రదించాలన్నారు. కాగా తుఫాన్ నేపథ్యంలో యానాం రాజీవ్ గాంధీ బీచ్ మూసివేశారు. రాజీవ్‌గాంధీ బీచ్‌లో గౌతమి గోదావరి వెంబడి ఈదురుగాలులు వీస్తుండడంతో పర్యాటకులకు ప్రవేశాలను మూసివేశారు. ఎవరూ బీచ్‌కు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లతో రహదారిని మూసివేశారు.

వెన్నులో వణుకు



ఆత్రేయపురం మండలం కట్టుంగ వద్ద నేలకొరిగిన వరిపంట



మండపేట మండలంలో నేలనంటిన వరి చేను

- అన్నదాతను వణికిస్తున్న మొంథా తుఫాన్...
- జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి పంట
- ఈనిక, గింజపోసుకునే దశలో వరిచేలు
- మొంథా కరుణిస్తే.. నవంబరు మొదటి వారంలో కోతలు
- తుఫాన్‌తో తీవ్ర నష్టం తప్పదంటున్నరైతన్నలు

పి.గన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అన్నదాతల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు వరిచేలు అక్కడక్కడా నేలకొరిగాయి. దీపావళి ముసురు తర్వాత ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు ఊపిరిపీల్చుకున్న తరుణంలో తుఫాన్ రూపంలో మళ్లీ వణికిస్తోంది. కాకినాడ- కోనసీమ జిల్లాల పరిధిలో మొంథా తుఫాన్ తీరం దాటొచ్చన్న వార్త తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతోపాటు ఈదురుగాలులకు చాలాచోట్ల వరి చేలు నేలనంటాయి. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి పంట చివరి దశకు రావడంతో అన్నదాతలు దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ తరుణంలో తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈసారి ఖరీఫ్‌కు 70 శాతం వరకు 1318, మిగిలిన 30 శాతం స్వర్ణ(7029), 333 రకాలను రైతులు ఎంపిక చేసుకున్నారు. అలాగే పలు చోట్ల రెండో పంటకు సంబంధించి విత్తన రకాలను సైతం పండించారు. ప్రస్తుతం పంట పూత దశ, పాలుపోసుకునే దశ, గింజ గట్టిపడే దశల్లో ఉంది. ఎంటీయూ1318, స్వర్ణ వంటి రకాలు పూత దశలో ఉన్నట్టయితే భారీ వర్షాలకు తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉంది. ఎంటీయూ 1318 రకంలో గొలుసుకట్టు దగ్గరగా ఉండడం వల్ల గింజ రంగుమారడం, మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉంది. నిరంతరాయంగా వర్షాలు పడితే గింజ మొలక వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కాగా 1318కంటే స్వర్ణరకం 15 నుంచి 20 రోజుల ముందే కోతకు వస్తాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలకు స్వర్ణం రకమే ఎక్కువగా దెబ్బతింటుందని రైతన్నల అభిప్రాయం.

10 వేల ఎకరాల్లో వరి నీటమునక

జిల్లావ్యాప్తంగా 1.63 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వాతావరణం కరుణిస్తే మండపేట, ఆలమూరు, రాయవరం, ద్రాక్షారామం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో నవంబరు మొదటి వారం తర్వాత కోతలు మొదలయ్యే అవకాశం ఉంది. అయితే వర్షాల కారణంగా కోతలు మరింత జాప్యం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. తుఫాన్ వస్తే స్వర్ణరకం ముందుగానే నేలనంటుతుందని.. భారీ వర్షాలతోపాటు తీవ్ర గాలులువీస్తే మిగతా రకాలైన 1318, 333 కూడా నేలనంటుతాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే గడిచిన వారం రోజుల వ్యవధిలో కురిసిన భారీవర్షాల వల్ల నేలనంటిన, నీటమునిగిన వరిచేలు జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లో 10 వేల ఎకరాల్లో ఉన్నట్టు వ్యవసాయాధికారుల అంచనా.

వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు పంపాలి

జిల్లావ్యాప్తంగా వరిచేలు పూత దశ, పాలు పోసుకునే దశ, గింజ గట్టిపడే దశల్లో ఉన్నాయి. కొన్ని మండలాల్లో నవంబరు మొదటి వారం దాటిన తర్వాత వరి కోతలు మొదలవుతాయి. భారీవర్షాలు, తుఫాన్‌ల కారణంగా కోతలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాల వల్ల వరిచేలు నేలనంటితే పాలు పోసుకునే దశలో ఉన్న రకాలకు సంబంధించి చేలల్లో ముందుగా వర్షపునీరును బయటకు పంపాలి. గింజలు రంగుమారడం, మాగుడు తెగులు, మానిపండు తెగులువ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రోపికోనాజోల్ పిచికారి చేయాలి. గింజ గట్టిపడే దశలో ఉన్న చేలల్లో అయితే నీరును బయటకు పంపించడంతోపాటు నిలిచిన, పడిపోయిన వరి కంకులను నిలబెట్టి మొలకలు కనబడితే 5 శాతం ఉప్పుద్రావణం(50 గ్రాముల స్ఫటిక ఉప్పు లీటరు నీటికి) కలిపి పిచికారి చేయాలి.

- బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి





కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

హరోం హర



పిఠాపురంలో



రాజమహేంద్రవరంలో...

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి లక్ష రుద్రాక్షలతో అలంకరణ

కార్తీక మాసం తొలి సోమవారం శైవ క్షేత్రాలు జనసంద్రమయ్యాయి. హరోంహర, ఓం నమశ్శివాయ అంటూ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఎటుచూసినా పంచాక్షరీ నామం ప్రతిధ్వనించింది. తుఫాన్ హెచ్చరికలు వున్నా తెల్లవారుజామునే ఆలయాలకు విచ్చేసి పరమశివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో భక్తుల పుణ్యస్నానాలు



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారు జామున రెండు గంటలకు ప్రారంభమైన భక్తుల రాక రాత్రి వరకు కొనసాగింది. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మ వార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఉమాకుక్కుటేశ్వర స్వామికి అర్చకులు పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉన్న మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

దక్షిణ కాశీ ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచామ క్షేత్రాల్లో ఒకటైన, దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అర్చకులు విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో సిబ్బంది, సేవకులు భక్తులకు సేవలు అందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భీమేశ్వరస్వామికి అభిషేకం, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



విద్యుద్దీపాలకాంతిలో కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో...

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. గోపూజతో కార్తీక సోమవారం పూజలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



మైనార్టీ యువతకు ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువతకు జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎం.సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఓఎంసీఏపీ, ఐఈఎస్‌ల సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడి తెలిపారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు http://naipunyam.ap.gov.in/user వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్హతలు: ఐటీఐ(2 సంవత్సరాలు) లేదా డిప్లమా(3 సంవత్సరాలు), ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పాస్ లేదా కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. గరిష్ఠ వయస్సు 30 సంవత్సరాలు.

ఉద్యోగ వివరాలు: ఎలక్ట్రీషియన్ ఉద్యోగం కోసం పనిచేసే ప్రాంతం జర్మనీ. జీతం 2600 నుంచి 2700 యూరోలు(సుమారు రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు). రెండు సంవత్సరాలు. ఒప్పందం ప్రకారం ఓవర్ టైమ్, అలవెన్సులు, వసతి, రాక సహాయం అందిస్తారు. గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని తెలిపారు. నవంబరు 2025 నుంచి 12-14 వారాలు జర్మన్ భాషా శిక్షణ ఉంటుందన్నారు. అప్లికేషన్ ఫీజు, శిక్షణ ఫీజుతో సహా రూ.1.15 లక్షలు అభ్యర్థి మూడు వాయిదాల్లో చెల్లించాలని తెలిపారు. అలాగే ఆహారం, వసతి, విమాన, వీసా చార్జీలు కూడా భరించాలన్నారు. కావాల్సిన పత్రాలు: పాస్ పోర్టు, మునుపటి కంపెనీ రిలీవింగ్ లెటర్, సంబంధిత విద్యార్హత సర్టిఫికేట్లు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు నవంబరు 2వతేదీ లోపు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే బయోడేటా వివరాలు స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీఎస్ఎస్‌డీసీ డాట్ ఇన్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నెంబర్లను సంప్రదించాలని సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

పిల్లా చంద్రానికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చంద్రం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డాక్టరేట్ అందుకున్నారు. నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందిన ఆసియా అంతర్జాతీయ సంస్కృతి పరిశోధనా విశ్వవిద్యాలయం ప్రతినిధులు కర్నాటక రాష్ట్రంలోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో చంద్రానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మూడు వేల ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను పేరెంట్స్ అసోసియేషన్ తరఫున సందర్శిస్తూ చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రానికి పలువురు అభినందనలు తెలిపారు.

గోదావరి స్నానాల ఘాట్లు మూసివేత



గోదావరి రేవులను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని గోదావరి ఘాట్లను మూసివేసినట్టు మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్, లక్ష్మీగణపతి ఘాట్‌లను పరిశీలించారు. నదిలోని నీటిప్రవాహం చూసి కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్లలోకి స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ కారణంగా ఘాట్‌లు ప్రమాదకరంగా మారడంతో వాటిని తాత్కాలికంగా మూసివేసినట్టు వెల్లడించారు. భక్తులు, ప్రజలు గోదావరి ఘాట్లకు వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట నగర ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వినూత్న, ఎస్‌ఈ ఇన్‌చార్జి రీటా, ఈఈ మాధవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్శిటీ మహిళ

కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ మహిళా కబడ్డీ పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు సేలంలో వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో ఈ నెల 29 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. గొల్లల మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరచిన 14 మంది క్రీడాకారులకు ఐదురోజులు కోచింగ్ క్యాంప్ నిర్వహించి జట్టును ఎంపిక చేశారన్నారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, ఎ.మట్టారెడ్డి, క్రీడా బోర్డు సహాయ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, కోచ్, పీవీవీ లక్ష్మి, మేనేజర్ కె.లోవరాజు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

186 గ్రాములు బంగారం, 263 గ్రాముల వెండి స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీకాకుళం రూరల్, గార పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ఇళ్లల్లో జరిగిన దొంగతనం కేసుల్లో 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. అంతర్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. 'శ్రీకాకుళం మండలం నందగిరిపేటలో 2, రాగోలులో 1,గార మండలం కె.మత్స్యలేశంలోని 3 దొంగతనాల కేసులు ఇటీవల నమోదయ్యాయి. కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వర్లు, ధర్మాది ప్రసాద్, మాడెం మోహన్‌కుమార్ ఈ చోరీలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. వారిని శ్రీకాకుళం మండలం తండ్యేంవలసలో సోమవారం అరెస్టు చేశాం. వారి నుంచి చోరీకి గురైన 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. ఈ ముగ్గురూ కాకినాడ సబ్‌జైల్లో ఉన్నప్పుడు స్నేహితులయ్యారు. చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఒక్కొక్కరిపై సుమారు 25 కేసులు ఉన్నాయి అని ఏఎస్పీ తెలిపారు. అలాగే దూసి గ్రామంలో రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం పోయిందని తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఇంట్లో ఎటువంటి చోరీ జరగలేదన్నారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయి ఎంపికలను వాయిదా వేసింది. ఈ మేరకు కొత్త తేదీలను త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా వాతావరణ హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరగాల్సిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు. కొత్త తేదీలను నిర్ణయించి అనంతరం సమాచారం అందించనున్నట్టు పేర్కొన్నారు.

పాదగయలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే సుబ్బరాజుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు సోమవారం విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే దంపతులను ఈవో జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదం, స్వామి,అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా సందర్శించారు. భార్య అనురాధ, కుమారుడు రంగనాగ్, కోడలు సృజన, మనుమలతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో బళ్ల నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరునికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకులకు నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

పలు రైళ్లు రద్దు

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ(18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. 28న విజయవాడ-భీమవరం(67281),భీమవరం-విజయవాడ(67282), భీమవరం-నిడదవోలు(67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ(67276), భీమవరం-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం(67257), రాజమండ్రి-భీమవరం(67241), 29న భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేసినట్టు సూపరింటెండెంట్ చక్రవర్తి పేర్కొన్నారు.

హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్

సౌత్ ఇండియా చైర్మన్‌గా కృష్ణమూర్తి



కృష్ణమూర్తికి నియామకపత్రం అందజేస్తున్న నేషనల్ చైర్మన్ ప్రసన్నకుమార్

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్‌గా లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ లింగమల్లు కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆయనకు నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ బీఎస్ కృష్ణ, ఏపీ ఎస్సీ సెల్ చైర్‌పర్సన్ బొల్లిపల్లి జోసీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొంథా.. ముందుగానే నీటి విడుదల!

● తుఫాన్ కారణంగా భారీ వర్ష సూచన

● ఏలేరు రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం/పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను సోమవారం సాయంత్రం 6గంటలు నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. ఇన్‌ఫ్లోస్ సాధారణంగా ఉన్నప్పటికి మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో దిగువకు నీటిని అధికంగా విడుదల చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం ఉదయం 6గంటలకు వరకూ 3175 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, 500 క్యూసెక్కుల వంతున పెంచుకుంటూ సాయంత్రానికి 5,175 క్యూసెక్కులకు పెంచారు. స్పిల్‌వే ద్వారా 4,400 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్ ద్వారా 600 క్యూసెక్కులు వెరసి 5వేల క్యూసెక్కులకు కాలువలకు విడుదల చేస్తున్నారు. విశాఖ అవసరాల నిమిత్తం 175 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ఇన్ ఫ్లోస్ 1700 క్యూసెక్కులు మాత్రమే ఉన్నాయి. ఇన్‌ఫ్లోస్ కంటే మూడు రెట్లు అధికంగా అవుట్‌ఫ్లోస్ ఉండడంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 21.90 టీఎంసీలకు తగ్గగా, నీటిమట్టం 85.47మీటర్లుగా ఉంది. తుఫాన్ ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. దీంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో అవుట్‌ఫ్లోస్ పెంచినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అత్యంత అప్రమత్తం

ఏలేరు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం తదితర మండలాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సమాచారం ఇస్తున్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 15 వేల క్యూసెక్కులు..

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 15వేల క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు సోమవారం విడుదల చేశారు. మొంథా తుఫాన్‌లో భాగంగా ముందు జాగ్రత్త చర్యగా డ్యాం సేఫ్టీ అధికార్ల ఆదేశాల మేరకు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో ఈఈ రాజారావు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా ఇటీవల ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న వలస గెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు తదితర చోట్ల నుంచి భారీగా వరద నీరు వచ్చి జలాశయంలోకి రావడంతో నీటి మట్టం 1036.50 అడుగులకు చేరుకుంది. నీటి మట్టాన్ని తగ్గించే చర్యల్లో భాగంగానే 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జలాశయానికి 10 వేల నుంచి 12వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయని, నీటి విడుదల నేపథ్యంలో జలాశయం దిగువున ఉన్న ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. కాంప్లెక్సు పరిధిలోని జోలాపుట్, సీలేరు జలాశయాల వద్ద కూడా జెన్‌కో అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద నీటిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.





ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు, పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు ప్రవాహ ఉధృతి

పంపా, తాండవ నుంచి కూడా...

అన్నవరం/కోటనందూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. తుఫాన్ నేపథ్యంలో అధికారులు రిజర్వాయిర్ వద్ద ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రస్తుతం 99 అడుగులు నీటిమట్టం ఉందని, ఇన్‌ఫ్లో 700 క్యూ సెక్కులు వస్తుండగా 650 క్యూసెక్కుల నీటిని పంట, వరద కాలువల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అలాగే తాండవ రిజర్వాయర్ నుంచి 310 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డీఈ అనురాధ తెలిపారు.



అన్నవరం పంపా రిజర్వాయర్‌లో నీరు

తుఫాన్ హెచ్చరికలు..
రత్నగిరిపై భక్తుల రక్షణకు చర్యలు

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచనలతో అన్నవరం దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఎండా, వానల నుంచి రక్షణగా పలు కూడళ్లలో రేకులషెడ్డులు వేసి క్లాత్ డెకరేట్ చేశారు. అయితే అవి గాలులకు ఎగిరిపోకుండా పటిష్టమైన తాళ్లతో బిగించి జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులు ఎక్కడా ఎక్కువసేపు నిల్చోవద్దని మైక్ ద్వారా ప్రచారం గావించారు. దర్శనాలు, వ్రతాలు పూర్తయిన వారు తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలంటూ ప్రచారం చేశారు.



భక్తులకు రక్షణగా ఏర్పాటు చేసిన రేకులను పటిష్టం చేస్తున్న అధికారులు

తగ్గిన భక్తుల తాకిడి

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం సత్యదేవుడి ఆలయంపై పడింది. కార్తీకమాసం సోమవారం పర్వదినమైనా భక్తులు సందడి పెద్దగా కనిపించలేదు. ఉదయం 10గంటలకే ఆలయప్రాంగణం ఖాళీ అయిపోయింది. సోమవారం సుమారు 4వేల వ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేసినా కేవలం 2వేలు మాత్రమే జరిగాయి. కార్తీక మాసం ప్రత్యేక అధికారులుగా నియమించిన డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తలుపులమ్మ ఆలయ ఈవో విశ్వనాథరాజు, చైర్మన్ రోహిత్‌లు కమాండ్ కంట్రోల్ రూం నుంచి క్యూలైన్‌లు, రద్దీ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. దేవస్థానం ఈవో సుబ్బారావు ప్రధానాలయం, ఇతర ప్రాంతాల్లో పర్యటించారు.



భక్తులు లేక వెలవెలబోతున్న సత్యదేవుడి ఆలయ ప్రాంగణం

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు



ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఫిమేల్ ఆర్థో వార్డులో 49 పడకల సామర్థ్యంతో తుఫాను ప్రభావంతో ప్రమాదాలు జరిగితే ఈ వార్డును వినియోగించేందుకు ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలు, ప్రత్యేక వైద్య బృందం, నిరంతరప్రాయంగా వైద్య సేవలు అందించేందుకు పలు విభాగాల వైద్య నిపుణులు, వైద్యేతర సిబ్బంది విధులు నిర్వర్తించే విధంగా జీజీహెచ్ ఆసుపత్రి అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంటర్ పరీక్ష ఫీజు 31 లోపు చెల్లించాలి

జరిమానాతో వచ్చే నెల 6 వరకూ అవకాశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే జనరల్, ఒకేషనల్.. రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 31లోపుగా పరీక్ష ఫీజును చెల్లించాలని తూర్పుగోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు. రూ.వెయ్యి జరిమానాతో నవంబరు 6 వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కి తెలియజేశామన్నారు. విద్యార్థులు గడువు లోపు పరీక్ష రుసుం చెల్లించాలని సూచించారు.

నిబంధనలు పాటించని 3 బస్సుల సీజ్



బస్సులను తనిఖీ చేస్తున్న కోనసీమ జిల్లా రవాణా అధికారి

ముమ్మిడివరం/రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 ప్రయివేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేసి మరో 9 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్ల టోల్ ప్లాజా

20 బస్సులకు జరిమానా

వద్ద నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 11 ప్రయివేటు ట్రావెలర్ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 బస్సులను సీజ్ చేసి, మరో 9 బస్సులపై ఇతర కేసులు నమోదు చేసి రూ.18 వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. సీజ్ చేసిన 2 బస్సుల్లో నిబంధనలు పాటించకుండా అనాధికారికంగా సీట్లు మార్పు చేసినట్టు గుర్తించామని వీటిని ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ అప్పగించామని తెలిపారు. అలాగే రావులపాలెం జాతీయ రహదారిపై తనిఖీ చేసి సిరి ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును సీజ్ చేయడంతో పాటు 11 బస్సులపై రూ.32వేల ఫైన్ విధించినట్టు ఆయన చెప్పారు.



బోటు.. ట్రాన్స్‌పోర్టు!

కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్రతీరం నుంచి పిఠాపురం మీదుగా ఓ బోట్‌ను వ్యాన్‌పై కాకినాడ సమీపంలో తుఫాన్ ముంపు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలకు సోమవారం తరలిస్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.



కాకినాడ జిల్లా తొండంగిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో బోటును ఒడ్డు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మత్స్యకారులు

తుఫాన్ ఎఫెక్ట్
పలు రైళ్లు రద్దు

రైల్వే స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు

రైల్వే యంత్రాంగం జాగ్రత్త చర్యలు

సామర్లకోట/ రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ఈదురు గాలులు, భారీవర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విశాఖ నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను 3రోజుల బాటు తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రద్దు, ఆలస్యం, రిజర్వేషన్ టిక్కెట్ల విషయాలు ప్రయాణికులు తెలుసుకునేందుకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 9 హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట రైల్వే స్టేషన్‌తో సహా రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్ స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేసి నిరంతరం సమాచారాన్ని అందివ్వనున్నట్టు తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 7382383188, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో 8331987657, కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో 0884-2374227 నంబర్లకు ఫోన్ చేసి రైల్వే సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే

విశాఖ-విజయవాడ మధ్య సామర్లకోట స్టేషన్‌మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ఈ నెల 28 మంగళవారం రైలు నెం.67285, 67286 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి మెము, 17268, 17267 విశాఖ-కాకినాడ-విశాఖ, 08583/84 విశాఖ-తిరుపతి-విశాఖ, 22875/76 విశాఖ-గుంటూరు-విశాఖ డబుల్ డెకర్, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెకర్, 17243/44 గుంటూరు-రాయగడ-గుంటూరు, 17220 విశాఖ- మచిలీపట్నం, 12727 విశాఖ-హైదరాబాద్, 12861 విశాఖ-మహబూబ్‌నగర్, 12862 మహబూబ్‌నగర్-విశాఖ(28న), 22869 విశాఖ- చెన్నై వీక్లీ, 12739న విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-ఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, 22707 విశాఖ-తిరుపతి వీక్లీ డబుల్ డెకర్, 18519 విశాఖ-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను రానుపోను రైళ్లను రద్దు చేశారు.

14 రైళ్లు పునరుద్ధరణ

తుఫాను కారణంగా విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు 14 రైళ్లను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ సోమవారం పునరుద్ధరించినట్లు రైల్వే డిప్యూటీ సీవోఎం సందీప్‌కుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 08583 విశాఖ- తిరుపతి, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, 17243 గుంటూరు-రాయగడ, 17244 రాయగడ-గుంటూరు, 17220 విశాఖ-మచిలీపట్నం, 12727 విశాఖ- హైదరాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 22869 విశాఖ-మద్రాసు వారాంతపు ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-న్యూఢిల్లీ, 22707 విశాఖ-తిరుపతి వారాంతపు డబుల్ డెక్కర్, 18519 నంబరు గల విశాఖ-ఎల్టీటీ రైళ్లు పునరుద్ధరించిన వాటిలో ఉన్నట్టు పేర్కొన్నారు. 20806 నంబరు గల న్యూఢిల్లీ-విశాఖ, 18520 నంబరు గల ఎల్టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఈనెల29న యథావిధిగా బయలుదేరనున్నాయి.

పర్ర కాలువలో పడి బాలుడు గల్లంతు

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో ఘటన

గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం





చరణ్‌సాయి(ఫైల్), గాలిస్తున్న ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పర్ర కాలువలో పడి 11 ఏళ్ల బాలుడు గల్లంతైన ఘటన సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. కాకినాడ మధురానగర్‌కి చెందిన పోలవరపు రమణ, దుర్గాభవానీ భార్యభర్తలు. కూలీ పనుల జీవనోపాధి కోసం తుని నుంచి 6నెలల కిందట మధురానగర్ వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి కొడుకు చరణ్ సాయి రిత్విక్ (11) ఉన్నాడు. స్థానికంగా ప్రైవేట్ పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్నాడు. తుఫాన్ కారణంగా పాఠశాలలకు సోమవారం నుంచి సెలవులు ఇవ్వడంతో ఆర్టీవో ఆఫీసు రోడ్డులో నివాసం ఉంటున్న మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇంటికి వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడ నుంచి నేమాంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి శ్రీనివాస్ బైక్‌పై చరణ్ సాయి రిత్విక్ ఇద్దరూ బయలుదేరారు. బీచ్‌రోడ్డులో రాకపోకలు నిషేధించడంతో సూర్యారావుపేట గ్రామం నుంచి పర్ర కాలువ మీదుగా వెళుతున్నారు. ఈ క్రమంలో పర్ర కాలువ కాజ్‌వై పైనుంచి ప్రవహిస్తోన్న వరద నీటిపై నుంచి వెళ్తుండగా అప్రోచ్ వద్ద ఉన్న నీటితో నిండిన గోతిలో బైక్ పడింది. బాలుడు బ్రిడ్జి అంచున పడడంతో పైకి లేపేలోపు నాకు ఈత వచ్చంటూ పర్ర కాలువలోకి దూకేశాడని మేనమామ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీరు ప్రవాహం ఉధృతిగా ఉందని, వెంటనే బయటకు వచ్చేయి అని చెప్పగా, అప్పటికే కొద్దిదూరం ఈదుకుంటూ వెళ్లిన చరణ్‌సాయి రుత్విక్ వెనక్కి వస్తున్న క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్టు శ్రీనివాస్ చెప్పినట్టు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీకి బాలుడు గల్లంతు సమాచారం తెలియడంతో పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడ్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సంఘటనా ప్రదేశం వద్ద తహశీల్దారు వీ.కుమారి, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ సిబ్బందితో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వీఆర్వో చిన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, మంగళవారం ఉదయం గాలింపు కొనసాగిస్తామన్నారు. రహదారిలో రాకపోకలు నిషేధిస్తూ కాజ్‌వేకు అడ్డంగా పెద్ద దుంగలు పెట్టినా వీటిని పక్కకు తోసేసి బైక్‌పై వెళ్లడం జరిగిందన్నారు.

ఒడిశా కార్మికుడి అనుమానాస్పద మృతి



కెసాబా పోడే (ఫైల్)

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవనంలో ఒడిశాకు చెందిన కెసాబా పోడే (49) అనే కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. లిఫ్ట నిర్మాణ ప్రదేశంలో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో పాటు శరీరంలోని కొన్ని అవయవాలు కనిపించకపోవడంతో కొన్ని రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కెసాబా పోడే పది రోజుల క్రితమే ఒడిశా నుంచి ఇక్కడికి పనికి వచ్చినట్టు చెప్తున్నారు. పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. కాగా మెడికల్ కాలేజీ భవన నిర్మాణంలో వర్కు సైట్ మేనేజర్‌తోపాటు వివిధ హోదాల్లో సూపర్‌వైజర్లు, మేస్త్రీ తదితరులు పనులు పర్యవేక్షిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు ఒకరు అదృశ్యమైనా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై సహచర కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క నిర్మాణ పనులు పర్యవేక్షించే ఏపీఎస్ఎంఐడీసీ అధికారులకు దీని గురించి తెలియదా ? లేక తెలిసీ నిర్లక్ష్యం చూపించారా అనే ఆరోపణలు వస్తున్నాయి.

లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం హైవేపై జరిగింది. నల్లగొండ నుంచి కాకినాడ వైపు సోనా మసూర్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న 16 చక్రాల లారీ ఎడమవైపునకు రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. నల్లగొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పిల్లి శ్రీను తలకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.



కాపవరం హైవేపై బోల్తా పడిన లారీ

మారణాయుధాలు చూపి దోపిడీకి యత్నం

ముగ్గురు యువకుల అరెస్ట్



నిందితులతో గోకవరం పోలీసులు

గోకవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మారణాయుధాలు చూపించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులను సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివ, తుమ్మల అరవింద్ కలిసి ప్రజలను మారణాయుధాలతో బెదిరించి దారి దోపిడీకి యత్నిస్తున్నట్టు గుర్తించామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

పిడుగుపడి గేదె మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో తుఫాన్ కారణంగా పిడుగుపడి కొండి చక్రానికి చెందిన గేదె మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ఎం.సూర్యప్రభ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

పేకాడుతున్న 18 మంది అరెస్ట్

రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో రెండు వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెదిరేశ్వరంలోని ఓ రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25,070 స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్థానిక శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,305 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు పేకాట శిబిరాల్లో అదుపులోకి తీసుకున్న 18 మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ శ్లాట్ల మార్పు

అమలాపురంటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్, లెర్నింగ్ లైసెన్సు కోసం శ్లాట్స్ బుక్ చేసుకున్న అభ్యర్థులు తుఫాను కారణంగా వచ్చే వారానికి శ్లాట్లను మార్చుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈనెల28, 29,30,31 తేదీల్లో శ్లాట్లను అభ్యర్థులు సిటిజన్ లెవెల్‌లో శ్లాట్‌లను మార్చుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ

అమలాపురం టౌన్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 15మందికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాలతో సోమవారం అమలాపురం పురపాలక సంఘంలో రెయిన్ కోట్లను మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పంపిణీ చేశారు.

మొంథా తుఫాన్‌తో ప్రజల్లో అలజడి

- కలెక్టర్, ఎమ్మెల్యేలు పర్యటన
- తీర ప్రాంతాల ప్రజలు ఆందోళన
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు






అంతర్వేది దేవస్థానంలో ముంపు నీటిలో కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జి అమూల్య, కాట్రేనికోన: గచ్చకాయలపొరలో ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్ పర్యటన, అయినవిల్లి: వీరవల్లిపాలెం గ్రామంలో పూరిళ్లులో నివాసం ఉంటున్న ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరుతున్న ఎమ్మెల్యే గిడ్డి, అంబాజీపేట: మండలంలో పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్, అధికారులు

కాట్రేనికోన, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాలకు వెళ్లి రక్షణ పొందాలని తీర ప్రాంత వాసులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఆర్డీవో కె.మాధవి సూచించారు. సోమవారం గచ్చకాయలపొరలో గ్రామస్తులతో వారు సమావేశమయ్యారు. మత్స్యకారులెవ్వరూ చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, అన్ని విధాల సహాయక చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

మత్స్యకారుల తరలింపు

కాట్రేనికోన, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసుల సన్నద్ధమయ్యారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పడవలపై మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పోలీసులు ప్రజలకు అండగా ఉంటారని సీఐ అన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్యేక అధికారి జి.మమ్మీ, తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో వెంకటచలం, ఎస్ఐ అవినాష్ పాల్గొన్నారు.

24 పునరావాస కేంద్రాల ఏర్పాటు

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉండడంతో అధికార యంత్రాంగమంతా అప్రమత్తమైంది. మండలానికి సంబంధించి 24 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. మండలంలో 730 పూరిపాకలను గుర్తించారు. వాటిలో 2వేల మంది ప్రజలు ఉన్నట్టు అంచనా వేశారు. వీరందరూ వాతావరణ పరిస్థితులను బట్టి పునరావాస కేంద్రాలకు గానీ, సురక్షిత పట్టా భవనాల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రత్యేకాధికారులు మధుసూదనరావు, పి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో దీక్షితులు తుఫాన్ నేపథ్యంలో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. ముమ్మిడివరం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలకు సంబంధించి ఒక్కో మండలానికి కొంతమంది సిబ్బందిని, 150విద్యుత్ పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, పవర్‌కట్టర్లను సిద్ధం చేశారు.

నేలనంటుతున్న వరి చేలు

మామిడికుదురు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపైన, పలు కాలనీల్లో చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం, మామిడికుదురు జాతీయ రహదారిపై వర్షం నీరు చేరడంతో తీవ్రఇబ్బందుల మధ్య వాహనదారులు ప్రయాణాలు చేస్తున్నారు. కరవాకలో 125, గోగన్నమఠంలో 50పడవలను సముద్రతీరంలో నిలిపివేయడంతో 1400మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయిన ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో 18గ్రామాల్లో 29తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. నగరం, గెద్దాడ గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వరిచేలు నేలనంటాయి. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహశీల్దార్ పి.సునీల్‌కుమార్‌లు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంచేసి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తండా ఉండాలని డీఎల్పీవో బొజ్జిరాజు, రాజోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి సూచించారు. మండలంలో తుఫాన్ పునరావాస కేంద్రాలను సోమవారం మండలాధికారులు పరిశీలించారు. సోమవారం రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మెరకపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రాలను, ప్రత్యేక వైద్య శిబిరాలను తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ బి.రాజేష్ పరిశీలించారు.

ముంపు ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

అంతర్వేది, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య నాయకులతో కలిసి సోమవారం పర్యటించారు. ముంపు నీటిలో నడిచివెళ్లి ప్రతీ కాలనీలో ఉన్న ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలన్నారు. అంతర్వేది రామ్‌బాగ్, వీఎన్ఎం కాలనీ, సునామీకాలనీలను పరిశీలించారు. అంతర్వేదిపల్లిపాలెం, కర్రివానితోట, పండ్లి, పెదశింగువారివీధి తదితర కాలనీలను పరిశీలించి పల్లిపాలెంలో ఉన్న మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని, అలాగే సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలు తరలిరావాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. అంతర్వేది తీరంలో పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరు, తుఫాన్ షెల్టర్లను సీఐ, ఎస్ఐ, మెరైన్ పోలీసులతో కలిసి పరిశీలించారు. 30మంది ఎస్డీఆర్ఎఫ్, మెరైన్, సివిల్‌పోలీసులు సంయుక్తంగా తీరప్రాంత ప్రజలకు రక్షణగా ఉండి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండలంలో 19పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కేశవదాసుపాలెం, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

పునరావాస కేంద్రాలకు రండి

తీరప్రాంత వాసులకు అధికారుల అభ్యర్థన

ఉప్పలగుప్తం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముందుకు వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో మకాం వేసిన అధికారులు సోమవారం ఉదయమే తీర గ్రామాలకు తరలి వెళ్లారు. ప్రత్యేక అధికారి రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో డి.కృష్ణ, ఎస్ఐ సీహెచ్ రాజేష్ తదితరులు గ్రామాల్లో పర్యటించి, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను అంచనావేశారు. ఎస్.యానాం, వాసాలతిప్ప గ్రామాల్లో మత్స్యకారులను కలిసి తుఫాన్ పరిస్థితిని వివరించారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాల్సిందిగా కోరారు. ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం, టి.చల్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ వాసా దివాకర్ వాసాలతిప్పలో వలస మత్స్యకారులకు తుఫాను ప్రభావంపై పూర్తి అవగాహన కల్పించి వారిని ఎస్.యానాంలో పునరావాస కేంద్రానికి రప్పించారు. ఎస్.కొత్తపల్లిలో ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, రెవెన్యూ, వైద్యఆరోగ్య సిబ్బందితో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏ సహాయం కావలసినా పోలీసులు సిద్ధంగా ఉన్నారని భరోసా ఇచ్చారు.




మామిడికుదురు: గెద్దాడలో నేలనంటిన వరిచేలు, రాజోలు: మెరకపాలెంలో పర్యటించిన అధికారులు

తాగునీరు, వైద్య సదుపాయం

అంబాజీపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలో 32 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయం కల్పించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, తహశీల్దారు చినబాబు, ఎంపీడీవో మమత, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, ఎస్ఐ చిరంజీవి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, విద్యుత్‌శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు. అంబాజీపేట తహశీల్దారు కార్యాలయంలో 9849903890తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు చినబాబు తెలిపారు.

భయం గుప్పెట్లో భైరవపాలెం

ఐ.పోలవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికలతో తీరప్రాంత ప్రజల్లో భయాందోళనలు చోటుచేసుకున్నాయి. తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న హెచ్చరికలతో మత్స్యకార గ్రామం భైరవపాలెం గజగజ వణుకుతోంది. సముద్రతీరానికి అతిచేరువలో ఉండటంతో తుఫాను ప్రభావం ఎలాఉంటుందోనన్న భయం ఆ ప్రాంత ప్రజలను వెంటాడుతోంది. అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు చేపల బోట్లను ఒడ్డుకుచేర్చి జాగ్రత్త పడ్డారు. ఇప్పటికే అధికార యంత్రాంగం భైరవపాలెం వచ్చి తుఫాన్‌పై మత్స్యకారులకు అవగాహన కల్పించింది. తుఫాన్ ప్రభావం ఉంటుందని, ఇళ్లు ఖాళీ చేసి తుఫాన్ షెల్టర్‌లోకి రావాలని తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఎస్ఐ రవీంద్రబాబు గ్రామస్తులకు సూచించారు. షెల్టర్లు ఏర్పాటు చేయకుండా తాము అక్కడికి వచ్చి ఏమిచెయ్యాలని వారు ప్రశ్నించారు. షెల్టర్లలో తమకు భోజనాలు సిద్ధం చెయ్యాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎ కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని చెప్పడంతో సమీపంలోని యానాం, భైరవపాలెం, ముమ్మిడివరంలోని తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు భయాందోళనలో ఉన్నారు.

తీరంలో ముందస్తు సహాయక చర్యలు

అల్లవరం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తుగా తీర గ్రామాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. తహశీల్దార్ వీవీవీఎల్ నరసింహం, నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.రాంబాబు, మండల ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి, ఎంపీడీవో గౌరీకుమారిలు తీర గ్రామాల్లో పర్యటించి ప్రజల తరలింపులో సహాయక చర్యలు చేపట్టారు. ఎస్.రామేశ్వరంలో 20కుటుంబాలు, సీతారామపురం వద్ద 10కుటుంబాలు, ఓడలరేవులో పలువురు మత్స్యకార కుటుంబాల వారిని తుఫాను షెల్టర్లకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు భోజనం, వసతి ఏర్పాటు చేశామని తహశీల్దార్ నరసింహం అన్నారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్, ఓడలరేవు మెరైన్ పోలీసులు, రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు తీర గ్రామాల్లో పర్యటించారు. ఓడలరేవు-కొమరగిరిపట్నంతీరగ్రామాల్లో సోమవారం భారీగాలులతో పాటు అలల ఉధృతి పెరిగి తీరం అల్లకల్లోలంగా మారింది. తీర గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, మల్లాడి ఉమామహేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, పి.సాయిబాబు, బి.ఆదిశంకరంతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్, పశు సంవర్థక, వైద్య ఆరోగ్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పర్యటించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో ఎమ్మెల్యే గిడ్డి పర్యటన

అయినవిల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఉండనున్న నేపథ్యంలో వీరవల్లిపాలెంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం పర్యటించారు. పూరిపాకల్లో నివశించేవారు సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తుఫాన్ సమయంలో ఎవరూ అధైర్య పడవద్దని, ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పునరావాస కేంద్రాలను పరిశీలించి ప్రజలకు అవసరమైన మందులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనేది ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే పర్యటనలో పాల్గొన్నారు.

మండలంలో 4వేల మందిని గుర్తించాం

మలికిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పునరావాస కేంద్రాల్లో ఉండడానికి 4వేల మందిని గుర్తించామని తహశీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు.సముద్రతీర ప్రాంతంలోని గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి,శంకరగుప్తం, పడమటిపాలెం, చింతలమోరి గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 552తాటాకిళ్లను గుర్తించామని, వీరందరినీ పునరావాస కేంద్రాల్లోకి తరలించడానికి అన్నిచర్యలు తీసుకున్నామని తహశీల్దార్ తెలిపారు.

డివిజన్‌లో 131తుఫాన్ షెల్టర్లు

పి.గన్నవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలో 131చోట్ల తుఫాన్ షెల్టర్లను ఏర్పాటు చేసినట్లు కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. ముంగండ, నరేంద్రపురం గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో తుఫాన్ షెల్టర్లను సోమవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్థానిక అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.జయచంద్రగాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, మండల ప్రత్యేక అధికారి హౌసింగ్ పీడీ ఎంవీ నరసింహారావులు గంటిపెదపూడి శివారు బూరుగులంక, అరిగెలవారిపేట, పెదపూడిలంక, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్ షెల్టర్‌ను పరిశీలించారు. ఆర్డీవో వెంట ఎస్ఐ బి.శివకృష్ణ, మండలస్థాయి హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. మొంథా తుఫాన్‌తో సోమవారంఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేని కాలనీల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో తుఫాన్ తీవ్రతపై టాంటాం ద్వారా అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వరి రైతులు వర్షం నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఏకాదశ రుద్రుల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ఏకాదశ రుద్రుల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. విశాఖపట్నం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా భక్తులు ఏకాదశ రుద్రుల దర్శనానికి తరలివచ్చారు. నందంపూడి, మాచవరం గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం పార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్కి కుంకుమ పూజలు చేపట్టారు.

శివనామ స్మరణతో హోరెత్తిన వీరేశ్వరస్వామి ఆలయం

ఐ.పోలవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గోదావరిలో పుణ్యస్నానాలాచరించిన భక్తజనం స్వామి దర్శనం కోసం బారులు తీరారు. వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీరేశ్వరస్వామికి వేకువజామున పంచామృతాభిషేకం జరిపించారు. మండలంలో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఐ.పోలవరం, ఎదుర్లంక, కేశనకుర్రుపాలెం, టి.కొత్తపల్లి, బాణాపురం, భైరవపాలెం గ్రామాల్లో శివాలయాల్లో స్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శైవక్షేత్రాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి శివాలయాల్లోకి వెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి, కొమనాపల్లి పార్వతీ సమేత చౌడేశ్వర, లోకేశ్వరస్వామి అయినాపురం ఉమాసూరేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి కొత్తలంక ఉమా భోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేలంక ఉమాసోమేశ్వర స్వామితో పాటు పలు గ్రామాల్లోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి.

ఉమామల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన

అల్లవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):అల్లవరం ఉమామల్లేశ్వరాలయంలో మూల వంశీయుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిగాయి. మూల లక్ష్మీనరసింహం, లక్ష్మీనరసింహశర్మ, సాంబశివశర్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఎన్.రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, బోడసుకుర్రు, గోడి పురాణ ప్రసిద్ధి పొందిన శివాలయాలతో పాటు పలు గ్రామాల్లో అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. అల్లవరం, గోడిలంక, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, దేవగుప్తం, యెంట్రుకోన, తాడికోన గ్రామాల్లో కార్తీక అభిషేకాలు, శివపూజలు ఘనంగా చేశారు.

యానాంలో ఆలయాలు కిటకిట

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం యానాంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు స్థానిక గౌతమిగోదావరి పుష్కరఘాట్‌కు తరలివచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. దీంతో రాజీవ్‌గాంధీ బీచ్ శివంబాత్ భక్తులతో కిటకిటలాడింది. బ్రాహ్మణులకు దీపదానంచేసి కార్తీక పూజలు చేశారు. అభయ ఆంజేయస్వామికి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలుచేశారు. దీంతో ఫెర్రీరోడ్డు కార్తీకశోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

వేకువజాము నుంచి శివాలయాల్లో పూజలు

ఉప్పలగుప్తం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మునిపల్లి పార్వతీమల్లేశ్వరస్వామి, గొల్లవిల్లి మాణిక్యాంబాసమేత భీమేశ్వరస్వామి, విలసవిల్లి, ఎస్.యానాం, భీమనపల్లి, గోపవరం, ఉప్పలగుప్తం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో క్రిక్కిరిశాయి.

దుక్కిపాటిపై పోలీసులకు ఫిర్యాదు

ఐ.పోలవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన దుక్కిపాటి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎదుర్లంక రామాలయంపేటకు చెందిన దుక్కిపాటి సత్యనారాయణను తక్షణం అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ రవీంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, వీధి చిరంజీవిమాదిగ, సవరపు వెంకట్, చెయ్యేటి శ్రీనుబాబు, లంక వరప్రసాద్, జొన్నాడ అజయ్, ముమ్మిడివరపు మన్యం, జొన్నాడ రాజు, వీధి లోవరాజు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో జి.అగ్రహారం విద్యార్థి ప్రతిభ



అంబాజీపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలో ఇటీవల జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల్లో గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ పదో తరగతి విద్యార్థి బొక్కా సత్యశివశ్రీసాయి మణికంఠ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈసందర్భంగా మణికంఠనను హెచ్ఎం అక్కిరాజు శేషసాయి, పీడీ ఏ.వెంకట సూర్యమధు అభినందించారు. అండర్-17 విభాగంలో చొల్లంగి జాహ్నవిశివదుర్గ, అండర్-17, 19 విభాగాల్లో వంటపాటి నాగశ్రీదుర్గ, సాదా నిఖితదేవి పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవింద్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి వేడుకలు యానాంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మైభారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. యానాం - ద్రాక్షారామ రోడ్డులోని మై భారత్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా ఈనెల31 నుంచి చేపట్టనున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో మై భారత్ వలంటీర్లు కిరణ్‌మన్నె తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలి'

ముమ్మిడివరం, అక్టోబర 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుకు సంబంధించి ప్రజలకు సేవలందించేందుకు ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలని ఏపీటీఎఫ్ సమావేశం తీర్మానించింది. ముమ్మిడివరంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఎస్ఎన్ మునేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కొన్నితీర్మానాలు ప్రవేశపెట్టి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే బ్యాగులను ఏడిద భాస్కరరావు, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌ల ఆర్థిక సహాయంతో సమకూర్చగా వాటిని సమావేశంలో ఉపాధ్యాయులకు అందించారు. స్టేట్‌కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, మోర్త రాజశేఖర్, ఎం.నాగభూషణం, జి.రవికుమార్, ఎన్.సత్యనారాయణ, కె.రాంబాబు, పి.అర్జున్, యు.శ్రీనివాసరావు, జి.రాంబాబు, పి.రాజేష్, డి.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

యానాం డీటీగా బాలశ్రీ

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యానాం రెవెన్యూశాఖ డిప్యూటీ తహశీల్దార్‌గా యానానికి చెందిన జువ్వాల బాలశ్రీని నియమిస్తూ పుదుచ్చేరి రెవెన్యూశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన రాత పరీక్షల్లో ఎంపికైన నూతన డీటీలకు సోమవారం గవర్నర్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. యానాం డీటీగా పనిచేసిన జ్యోతి వెంకటేశ్వరరావును యానాంతూనికలు కొలతల శాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జువ్వాల బాలశ్రీని నియమించారు.

'ప్రజలకు కూటమి నాయకులు అండగా ఉండాలి'

ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో తీర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు పొంచి ఉన్నందున కూటమి నాయకులంతా వారికి అండగా నిలవాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సూచించారు. కూటమి నాయకులంతా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారిని సమస్యలు అడిగి తెలుసుకుని అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాను నియోజకవర్గంలోని ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా వారికి సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన ముమ్మిడివరం నియోజకవర్గంలో సోమవారం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, అధికారులతో కలిసి తీర గ్రామాల్లో పర్యటించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఐదు అర్జీలు



అమలాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఐదుగురి నుంచి అర్జీలను స్వీకరించారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు.

సిద్ధివినాయకుడికి వెండి 'పంచహారతుల' బహూకరణ

అయినవిల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాయచూర్‌కు చెందిన కరుటూరి వెంకటరామకృష్ణ కుటుంబ సభ్యులు అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారికి రూ.1.90లక్షల విలువైన వెండి పంచ హారతులను సోమవారం స్వామివారికి సమర్పించారు. 1.421కిలోల వెండి పంచ హారతులను తయారు చేయించి స్వామివారికి సోమవారం వేదపండితులకు అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, జాస్తి సురేష్, పోతుల వెంకట్రావు, గెల్లా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యం గుర్తింపు

పి.గన్నవరం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మద్యందుకాణాల్లోసురక్ష యాప్ ద్వారా నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు సూచించారు. పి.గన్నవరం సెంటర్‌లో ఉన్న మద్యం షాపును సోమవారం వారు సందర్శించి అనంతరం మాట్లాడారు. సంసాని పెద్దిరాజు, శేరు శ్రీనుబాబు, గుడాల వెంకటరమణ, గుత్తుల రామకృష్ణ, కుంపట్ల బాబ్జి, కడలి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు 31వరకు గడువు

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులతో పాటు గతంలో పరీక్షలు తప్పిన విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల31వరకు గడువును పొడిగించినట్టుజిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించినవారు, గతంలో పరీక్ష తప్పిన వారు ఫీజులు చెల్లించుకునే వెసులుబాటుకల్పించారని, నవంబరు 1 నుంచి 6వరకు రూ.వెయ్యి అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు

ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్‌లో కౌన్సిలర్ బొంతు



ముమ్మిడివరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గత కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ఎంత వరకు పరిష్కరించారో చెప్పిన తరువాత అజెండాను చదవాలని, ప్రజా సమస్యలను కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించలేనప్పుడు తాము సమావేశాలకు వచ్చి ప్రయోజనం ఏమిటని 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ సమావేశంలో తీవ్ర అసంతృప్తిని, ఆవేదనను వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశం ప్రారంభంలో అజెండాలోని అంశాలను ఆమోదం కోసం కౌన్సిల్ ముందు ఉంచేందుకు ఉపక్రమిస్తుండగా బొంతు సత్యశ్రీనివాస్ అడ్డుతగిలి గత సమావేశంలో తాను లేవనెత్తిన సమస్యను ఏమేరకు పరిష్కరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మందబయలు ప్రాంతంలో ఒక మైనార్టీ బడ్డీ పెట్టుకుంటే దాన్ని తొలగించేశారని, హైవే పక్కన పంట బోదెలు, మురుగునీటి బోదెలను ఆక్రమించుకుని లేఅవుట్లు వేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని బొంతు సత్యశ్రీనివాస్ టౌన్ ప్లానింగ్ అధికారులను నిలదీశారు. దీనిపై కమిషనర్ రవివర్మ ఆ బడ్డీ వెనకాల ఉన్న ప్రజలు ఫిర్యాదు మేరకు తొలగించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందించి ఆక్రమణలపై వచ్చిన అన్ని ఫిర్యాదులపై సక్రమంగా చర్యలు తీసుకుని ఉండి ఉంటే మిమ్మల్ని ఎవరూ ప్రశ్నించరు కదా అని, ఒక ఆక్రమణ తొలగించి మరో ఆక్రమణ తొలగించకుండా ఉంటే ఇటువంటి సమస్యలే వస్తాయని నగర పంచాయతీ పరిధిలోని అన్ని ఆక్రమణలపైనా సక్రమంగా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. తమ వార్డులో భవన నిర్మాణానికి అప్రూవల్ ఇస్తామని వార్డు ప్లానర్ కొంత సొమ్మును తీసుకున్నారని, అయితే సంవత్సరం గడిచినా అప్రూవల్ ఇవ్వడం లేదని 19వ వార్డు కౌన్సిలర్ సౌజన్య సమావేశంలో ఫిర్యాదు చేశారు. ఆ వార్డు ప్లానర్ బాలకృష్ణ వివరణ ఇస్తూ ఆ సొమ్ములను ఎల్‌టీపీకి కట్టడం జరిగిందని, అయితే కౌన్సిలర్ భర్త అప్రూవల్‌ను ఆపమని ఎల్‌టీపీకి చెప్పారని వివరణ ఇచ్చారు. దీనిపై ఆ కౌన్సిలర్ ఆరోపణల్లో వాస్తవం లేదని ఎవరూ కూడా అటువంటి వాటిని సమర్థించమని పేర్కొనడంతో ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఎల్‌టీపీ లైసెన్సు రద్దుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. డంపింగ్ యార్డులోని చెత్త రోడ్డుపైకి వస్తుందని, ఆ రోడ్డుపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ గంజా శ్రీనివాసరావు, అడబాల సతీష్‌కుమార్‌లు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే ఆ చెత్తను రీసైక్లింగ్ యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈలోపు ఆ చెత్తను లోపలికి నెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రవివర్మ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అధికారులంతా ఆ విధంగా పనిచేస్తే సమస్యలు ఉత్పన్నం కావని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. వైస్‌చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

అమలాపురం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్(37) ఈనెల25న ఇంటి నుంచి స్కూటరుపై రాజమహేంద్రవరం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వారు డయల్ 112కు లేదా భార్య దేవి సెల్ 9390556767, పట్టణ సీఐ 9440796561కు సమాచారం అందించాలని కోరారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం




కె.గంగవరం మండలం కోటిపల్లి మత్స్యకారకాలనీలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరుతున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

ఆత్రేయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పల్లపు వీధిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో సోమవారం డి.కాంతానికి చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఆమె ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు ఆమెను రక్షించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల క్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

• కోటిపల్లిలో మత్స్యకార కాలనీ, పునరావాస కేంద్రాలను పరిశీలించిన మంత్రి సుభాష్ • అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు

కె.గంగవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణకు కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ఆయన తుఫాన్ ప్రభావిత ప్రాంతమైన కోటిపల్లిలో పర్యటించారు. స్థానిక మత్స్యకార కాలనీలోకి వెళ్లి గుడెసెల్లో నివశిస్తున్న వారు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరారు. అనంతరం కోటిపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన ప్రజలకు మంచి నీరు, ఆహారం, పాలు వంటివి కల్పించాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటం వలన అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆస్థి, ప్రాణనష్టం జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, కర్రి చిట్టిబాబు, చీకట్ల సోమేష్, పెమ్మాడి సత్తిబాబు, చీకట్ల రాము, కోటిపల్లి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు ఓలేటి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు శుభ్రంగా ఉండాలి: ఆర్డీవో: కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం ఆర్‌డీవో డి.అఖిల పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లోకి వచ్చే ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించాలని, పునరావాస కేంద్రాలు శుభ్రంగా ఉండేలా శానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట తహశీల్దార్ శ్రీరామ ప్రసాద్, ఎంఈవో ఏ. నాగరాజు తదితరులు ఉన్నారు.

తుఫాన్ పట్ల విద్యుత్‌శాఖ సిద్ధం

అలమూరు(ఆంధ్రజ్యోతి): మొంథాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సమస్యపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపటేందుకు విద్యుత్ శాఖ సర్వం సిద్ధం చేసింది. ఆలమూరు మండలానికి ఇక్కడ ఉన్న సిబ్బందితోపాటు అదనంగా నంద్యాల నుంచి 30 మంది ప్రత్యేక బృందం ఇక్కడకి చేరుకుంది. ట్రాన్స్‌కో డీఈఈ సీహెచ్ శ్రీధర్ అధ్వర్యంలో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరంతరం అందు బాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఆలమూరుకు వచ్చిన ప్రత్యేక బృందానికి ఆలమూరులోని కాపు కల్యాణ మండలంలో వసతి ఏర్పాటు చేశారు. ఆలమూరులో విద్యుత్ సరఫరాకు అవాంతరం ఏర్పడితే 94409 04521లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పునరావాస కేంద్రాలు రెడీ: తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఆలమూరు మండలంలో నాలుగు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రత్యూష తెలిపారు. బడుగువానిలంక పాఠశాల భవనం, ఆలమూరు బీసీ హాస్టల్, జడ్పీ గరల్స్ హైస్కూల్, ఆలమూరు కాపు కల్యాణ మండపాలను సిద్ధం చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల వారితో పాటు ఇంటి పైకప్పులు సక్రమంగా లేనివారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. మండలంలోని పలు ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించినట్టు తెలిపారు.

వాటర్ ట్యాంక్‌ల వద్ద జనరేటర్: తుఫాన్ దృష్ట్యా మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ట్యాంక్‌ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసినట్టు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో 23 వాటర్ ట్యాంక్‌లున్నాయన్నారు. వీటి వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసి మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఆయా గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కాల్ సెంటర్లు ఏర్పాటు చేశామమన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ కారణంగా ఆయా గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. తహశీల్దారు రాజేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆత్రేయపురం మండలం కట్టుంగలో చేతికి అందిన వరిపంట నేలకొరిగింది. వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో నిర్మించిన అన్నదాన షెడ్ వద్ద ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు సోమవారం సిబ్బందిని అప్రమత్తం చేశారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. సోమవారం రామచంద్రపురం మండలం మాలపాడు ఎంపీపీ పాఠశాల, వెంకటాయపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, పూరిగుడిసెలు, శిథిల భవనాల్లో నివసిస్తున్నవారు వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. సమస్యలపై డివిజనల్ కంట్రోల్ రూమ్ 08857 245166, మండల స్థాయి కంట్రోల్‌రూమ్‌లు తహసీల్దార్ రామచంద్రపురం 98493 86738, కె.గంగవరం తహసీల్దార్ 90304 22739, తహసీల్దార్ మండపేట 7989997185, తహసీల్దార్ కపిలేశ్వరపురం 93811 45177, తహసీల్దార్ రాయవరం 96180 06344లో సంప్రదించాలని కోరారు.

మురుగునీరు పోయే మార్గాలు చేసుకోండి

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి సూచించారు. సోమవారం ఆయన కోట, రాజవైరి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. వరి పొలాల్లో నీరు లేకుండా ఎప్పటి కప్పుడు మురుగుడ్రైన్ల ద్వారా బయటకు మళ్లించుకోవాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట(ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఆయా గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సేవలు 24 గంటలు అందేలా అధికారులను సిద్ధం చేశామన్నారు. గుడిసెల్లో ఉండే వారిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. మండపేటతో పాటు మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో తుఫాన్ సహాయక చర్యలు తీసుకోవడంతోపాటు 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూంలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. కపిలేశ్వరపురం 93811



ఆలమూరు మండలంలో పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

45177, మండపేట 79899 97185, రాయవరం 96180 06344, మండపేట 98499 06527 నెంబర్లకు ప్రజలు ఫోన్‌లో తెలపాలన్నారు.

పొంగుతున్న మురికికాల్వలు: భారీ వర్షాలకు ఆయా పంట పొలాలు ముంపునకు గురికాగా నియోజకవర్గంలో వున్న మురుగు కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో వున్న తుల్యభాగ డ్రైన్‌తోపాటు, వెదురుమూడి మురుగుకాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైన్లలో పెరిగిపోయిన గుర్రపుడెక్క ముంపునీరు దిగేందుకు ఆటంకంగా మారిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

డ్రైన్లలో వ్యర్థాల తొలగింపు: పట్టణంలోని మురుగు డ్రైన్‌లలో ముంపునీరు దిగేందుకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని మండపేట మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్ చెప్పారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాల మేరకు ఆయా డ్రైన్లలో వ్యర్థాలను జేసీబీతో సోమవారం తొలగించామన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు
మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు

మండపేట (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు తెలిపారు. అత్యవసర సేవల కోసం 79899 97185 ఫోన్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

యంత్రాంగం సిద్ధంగా ఉంది
నియోజకవర్గ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని మండపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీఎల్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మండపేట మండల పరిషత్‌లో ఆమె ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మండపేట మండలంలో పలు పూరిళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు పంపించామని ఆమె చెప్పారు. మండలంలో 17 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు
మండపేట విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీధర్

తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మండపేట విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీధర్ తెలిపారు. విద్యుత్ తీగలు, స్తంభాలు పడిపోయినా వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలపై మండపేట 94409 04519, ద్వారపూడి 94409 04527, ఆలమూరు 94409 04521, రాయవరం 9493178873, ఏడిద 94409 04503 ఫోన్‌లకు చేసి సేవలను పొందవచ్చని తెలిపారు. ఎక్కడ విద్యుత్ సమస్య వచ్చినా సత్వరమే తమ సిబ్బందికి ఫోన్ చేయాలన్నారు.

తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధం
కమిషనర్ రంగారావు

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉందని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో విద్యుత్, మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో



రాయవరం మండలం లొల్లలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు భాస్కర్

డ్వాక్రా సంఘాల మహిళలు ప్రజలను అప్రమత్తం చేశాయన్నారు. మెప్మా అధికారి సుజాత సారథ్యంలో మహిళలు ఇంటింటికీ వెళ్లి తుఫాన్ పట్ల పలు సూచనలు చేశారు.

వైసీపీ శ్రేణులు భాగస్వాములు కావాలి
ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

తుఫాన్ పరిస్థితులను ఎదుర్కోవడంతోపాటు ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు వైసీపీ శ్రేణులు సమాయత్తం కావాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. తుఫాన్ సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

23 పునరావాస కేంద్రాల ఏర్పాటు

రాయవరం(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో మండలంలోని 12 గ్రామాల్లో 23 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దారు టీవీ భాస్కరరావు తెలిపారు. మండలంలో తాటాకిళ్లు, పెంకుటిళ్లల్లో నివాసం ఉండే 52 కుటుంబాలను గుర్తించామని, వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మండలంలో తుఫాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని మైక్‌లో అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పసలపూడిలో తుఫాను నేపథ్యంలో కొందరు రైతులు ఆదివారం రాత్రి యంత్రాల ద్వారా వరికోతలు చేపట్టారు. రాయవరం మండలంలో ఉదయం తేలికపాటి వర్షం కురిసినప్పటికీ మధ్యాహ్నానికి వర్షం పెరిగింది.

వర్షాలకు నేలకొరిగిన వరి పంట

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వరి పొలాలు నేలకొరుగుతున్నాయి. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేసిన పంటపొలాలు ఈనిక దశ, గింజ తయారీ దశలో ఉన్నాయి. తుఫాన్ ప్రభావం కారణంగా నష్టాలు చూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హోర్డింగుల తొలగింపు: తుఫాన్ నేపథ్యంలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల వల్ల ప్రాణనష్టం కలగకుండా అధికారులు వాటిని తొలగించారు. రావులపాలెం సెంటర్ నుంచి గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ వరకూ రహదారికి ఇరువైపులా ఉన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తొలగించారు. టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐ చంటి, మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌కేవీ చౌదరి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తదితర అధికారులు ఫ్లెక్సీల తొలగింపు చేపట్టారు.

హాస్టళ్ల విద్యార్థుల తరలింపు: రావులపాలెంలోని ఎస్సీ, బీసీ హాస్టల్ భవనం పాడైన నేపథ్యంలో అందులోని విద్యార్థులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ హాస్టల్‌లో 130 మంది విద్యార్థులు ఉండగా వారిలో 40 మందిని తల్లిదండ్రులు తీసుకుని వెళ్లారు. మిగిలిన విద్యార్థులను పక్కనే ఉన్న జడ్పీ బాలికల పాఠశాల భవనంలోకి తరలించారు. ఆర్డీవో వెంట తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ఉన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు: రావులపాలెం మండలంలో ఏటిగట్టు, కాలువగట్లు, పూరిపాకల్లో ఉంటున్న వారిని అధికారులు పునరవాస కేంద్రాలకు తరలించారు. సోమవారం ఉదయం నుంచి సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐ చంటి, మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌కేవీ చౌదరి, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఇతర శాఖల అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గోపాలపురం ఏటిగట్టు చెంతనే ఉన్న 40 కుటుంబాలను స్థానికంగా ఉన్న పునరావాస కేంద్రాలకు తరలించారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు: తుఫాన్ నేపథ్యంలో మంగళవారం రావులపాలెం డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే 23 ఆర్టీసీ సర్వీసులను రద్దు చేసినట్లు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బొబ్బర్లంక, ముక్తేశ్వరం, మురమళ్ళ, ముమ్మిడివరం, కట్టుంగ, నార్కెడిమల్లి, కాకినాడ, సామర్లకోట, ఏలూరులకు బస్సులను రద్దు చేశామన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి: మండలంలోని 12 గ్రామాలకు చెందిన ప్రజలు, పక్కా భవనాల్లో లేనివారు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని అధికారులు సూచించారు. రెండు రోజులకు సరిపడిన తాగునీరు, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను ప్రజలు పాటించాలని తహసీల్దార్ జి. శ్రీనివాస్, మండపేట రూరల్ సీఐ దొరరాజు కోరారు. సోమవారం మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, కోరుమిల్లి, వల్లూరు, కాలేరు, కేదార్లంక తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాను సమయంలో బయటకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉండాలన్నారు. మండలంలో 185 తాటాకిళ్లను గుర్తించి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాఠశాలల్లోని 32 పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ, విద్యుత్, మెడికల్ తదితర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కొత్తపేట మండలం వానపల్లి సంఘం పాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన నిర్వాసితులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. వీటి ఏర్పాటు చేసిన పర్యవేక్షణ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఆర్‌ఐ రవిశంకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మైకులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రచారం: ఉపాధ్యాయ అవార్డు పొందిన ఆలేటి దుర్గాప్రసాద్ అవిడి మోడ్రన్ ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో సోమవారం ఆయన మైకు తీసుకుని తన వాహనంపై పలు వీధుల్లో తిరుగుతూ తుఫాన్ పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలు ఇంట్లోనే ఉండాలని అవసరమైతే తప్ప బయటకు రావద్దని అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు పక్కన, గుడిసెల్లో ఇళ్లల్లో ఉండే వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన అవగాహన కల్పించారు.



కొత్తపేటలో తుఫాన్‌పై ప్రచారం చేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్ మాస్టార్

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామివారు

ఆత్రేయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆయా శివాలయాల్లో భక్తజనం పోటెత్తారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకాలు జరిపి శివనామస్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ఆత్రేయపురం బాలత్రిపుర సుందరీ సమేత రాజరాజేశ్వరిస్వామి ఆలయాలతో పాటు ఆయా గ్రామాల్లోని శివాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి.

కోటిపల్లి ఆలయంలో..

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో హోరెత్తింది. భక్తులు వేకువజాము నుంచే గోదావరిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో భీమశంకరం కావల్సిన ఏర్పాట్లు చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, గంగవరం, దంగేరు, మసకపల్లి, బాలాంత్రం, భట్లపాలిక, కుందూరు గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మార్మో



కపిలేశ్వరపురంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

గింది. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. మండలంలో ఆయా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

మండపేట(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం కావటంతో భక్తులు తెల్లవారుజామునుంచే శివాలయాలకు పోటెత్తారు. మండపేటలోని రథంగుడి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏడిదలో వున్న సంగమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకుడు శర్మ నేతృత్వంలో జరిగాయి. స్వామివారి ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న జ్ఞానయోగి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని సోమేశ్వరం శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. సోమేశ్వరంలో ఈవో శోభారాణి ఆధ్వర్యంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, సోమశేఖరశర్మ అర్చకత్వంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సోమేశ్వరం శివాలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. స్వామివారిని టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, ఉత్సవ కమిటీ ఛైర్మన్ రావుల రామకృష్ణ దర్శించుకున్నారు. రాయవరం పార్వతి సమేత రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో, రాయవరం అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వరస్వామి, వి.సావరం మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి, నదురుబాద మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



కె.గంగవరం: కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ప్రత్యేక అభిషేకాలు

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా శైవక్షేత్రాల్లో సోమవారం ఉదయం నుంచే స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా శైవక్షేత్రాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురంలోని శ్రీ దుర్గాపార్వతి సమేత పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అర్చకుల ఆధ్వర్యంలో భక్తులతో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు 108 ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ పితాని సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



రావులపాలెం మండలం కొమరాజులంకలో పార్వతీ వీరేశ్వరస్వామివారు



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరంలోని సోమేశ్వరస్వామివారు



మండపేట మండలం ఏడిద సంఘమేశ్వర ఆలయంలో సంఘమేశ్వరస్వామివారు



కొత్తపేటలోని పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు

భీమేశ్వరస్వామి క్యాలెండర్ ఆవిష్కరణ

ద్రాక్షారామ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి 2026 క్యాలెండరును మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. సోమవారం తెల్లవారుజామున ఆలయంలో స్వామివారి క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ పర్యవేక్షకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వామివారిని మంత్రి దర్శించుకున్నారు.

తుఫాను ప్రభావం: తొలి కార్తీకసోమవారంపై తుఫాను ప్రభావం పడింది. ఉదయం నుంచి రాత్రి వరకు తరచూ వర్షం కురవడంతో భక్తుల రాక తగ్గింది. ఆర్టీసీ పంచారామాల బస్సులు రద్దు చేయడంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో భక్తులు తరలివవచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ భక్తులకు దర్శన సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆలయంలో సేఠ్ గోపీరామ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. ఫైండా వారి సత్రంలో యథావిధిగా అన్నదానం జరిపారు. ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వాడపల్లి ఆలయానికి 250 మంది పాదయాత్ర

ఆత్రేయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు, నెలమూరు గ్రామాలకు చెందిన 250 మంది భక్తులు సోమవారం ఉదయం పాదయాత్రగా స్వామివారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. వాడపల్లి ఆలయానికి ఉదయం 12 గంటలకు ఈ బృందం చేరుకుని స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.



వాడపల్లి ఆలయానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు



నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ద్రాక్షారామ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలం ఆదివారపుపేట రోడ్డులోనున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్థంభ ప్రతిష్ఠను సోమవారం జరిపారు. అయ్యల సోమయాజుల శర్మ బ్రహ్మత్వంలో పురోహితులు పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్థంభ ప్రతిష్ఠను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నురుకుర్తి శ్రీను, పెంకె ముసలయ్య, నీల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఆర్టీసి కండక్టర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం డిపో వద్ద నిర్వహించిన గేట్ మీటింగులో ఆర్టీసి ఉద్యోగులు డిమాండు చేశారు. ఈనెల 23న కోరుమిల్లి సర్వీసులో విధులు నిర్వహిస్తున్న కె.మంగేశ్వరరావును టి.అన్నపూర్ణ ఉచిత ప్రయాణం టిక్కెట్టు కోరగా నిరాకరించారు. దీంతో ఆమె దుర్భాషలాడి తిరుగు ట్రిప్పులో తుట్టపు అన్నపూర్ణ, కుమారుడు భూషణం, అడ్డాల ఆదినారాయణ కాపుకాసి అతనిపై దాడి చేయగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో నిందితులను శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.పి.రావు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ వి.ఎల్.నారాయణ, నేషనల్ యూనియన్ కార్యదర్శి బి.ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.



గేటు మీటింగులో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు